Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

8 Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 181 | Friday : 27.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :1801 | శుక్రవారం 27 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774



# పార్టీలకు జూబ్లీ పరీక్ష?

త్వరలో మరో ఉప ఎన్నిక రాబోతోంది.


తెలంగాణ ఉద్యమ సమయంలో తరచూ ఉప ఎన్నికలు వచ్చేవి

బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉద్యమ సమయంలో రాజీనామా చేసేవారు.

ఇక త్వరలో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నికలు

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలు సిద్ధం

తాజా సర్వే ఫలితాలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి.




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్**

తెలంగాణలో త్వరలో మరో ఉప ఎన్నిక రాబోతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తరచూ ఉప ఎన్నికలు వచ్చేవి. బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉద్యమ సమయంలో రాజీనామా చేసేవారు. అయితే ప్రస్తుతం ఉప ఎన్నికలు సిట్టింగ్ ప్రతినిధులు మరణించడంతో వస్తున్నాయి. గతేడాది కంటోన్‌మెంట్ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఇది బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. కానీ కాంగ్రెస్ గెలిచింది. ఇక త్వరలో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఇది కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానమే. ఈ స్థానంలో ఎవరు గెలుస్తారనేది ఉత్కంఠగా మారింది.తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్రవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నిక, ప్రధాన పార్టీల మధ్య ప్రతిష్టాత్మక పోరుగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలను సిద్ధం చేస్తుండగా, తాజా సర్వే ఫలితాలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఎంఐఎం పాత్ర, అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు ఈ ఎన్నిక ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశాలుగా మారాయి.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రధాన పార్టీలకు కీలక పరీక్షగా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సీటును గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. 2023 ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్క సీటు కూడా గెలవలేని కాంగ్రెస్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించి ఊపు మీద ఉంది. ఈ ఊపును జూబ్లీహిల్స్‌లో కొనసాగించాలని భావిస్తోంది. రేవంత్ రెడ్డి, అభ్యర్థి ఎంపికను హైకమాండ్‌కు వదిలేస్తూ, నాయకులు స్వయంగా ప్రకటనలు చేయవద్దని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ నుంచి మాజీ క్రికెటర్ మహ్మద్ అజహరుద్దీన్ - మిగతా3లో



## అమర్‌నాథ్ యాత్రపై పహల్గామ్ ఉగ్రదాడి ప్రభావం

- 10 శాతం తగ్గిన రిజిస్ట్రేషన్లు
- 85,000 మందికిపైగా ప్రజలు అమర్‌నాథ్ యాత్ర చేపట్టాలని భావిస్తున్నారని వెల్లడి
- ఉగ్రదాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించిన తర్వాత రిజిస్ట్రేషన్ నమోదు తగ్గింది

## రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే

# తోక కట్ చేస్తాం

- గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టం
- లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశాం
- రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ
- రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదు
- ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా డేగకన్ను వేశాం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, గుంటూరు**

రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు హెచ్చరించారు. రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తానని వార్నింగ్ ఇచ్చారు. గురువారం గుంటూరులో యాంటీ నార్కొటిక్స్ డేలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. గంజాయి సాగుతో దేశాన్ని, ఏపీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ బ్రాండ్‌ను గత పాలకులు నాశనం చేశారని ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నానని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. అడ్డొస్తే తొక్కుకుంటూ వెళ్తాం.. వదిలిపెట్టమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టమని.. లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశానని తెలిపారు. రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదని అన్నారు. మారితే మారండి.. మారకపోతే ఏపీలో ఉండే - మిగతా3లో



## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు

- ఎల్లో హెచ్చరికలు జారీ
- ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది.
- అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



## షాకిచ్చిన ట్రంప్.. సోషల్ మీడియా వివరాలు ఇవ్వకపోతే వీసా రద్దు!

తద్వారా సోషల్ మీడియా అకౌంట్లలో వీసా అప్లయి దారులు ఏ మాత్రం నెగిటీవ్ అనిపించినా అలాంటి వారు అమెరికాలోకి అడుగు పెటట్టడం అసాధ్యం




## ఈసీ కీలక నిర్ణయం.. 345 రాజకీయ పార్టీలపై కొరడా

- 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు
- ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయి

## పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్**

నిజామాబాద్ ప్రాంత రైతులకు పసుపు బోర్డు బహుమతి అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో పర్యటిస్తున్న ఆయన.. మీడియా సమావేశంలో మాట్లాడారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని చెప్పారు. ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్‌ట్యాపింగ్ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు





## టూ వీలర్లపై టోల్ ఛార్జీలు?

- ఫేక్‌న్యూస్ అని స్పష్టం చేసిన కేంద్రం
- ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా స్పష్టత
- 'భారత ప్రభుత్వం ద్విచక్ర వాహనాలపై టోల్ వసూలు చేయాలని యోచిస్తున్నట్లు కొన్ని మీడియా సంస్థలు కథనాలు

## బాబూ.. 9,000 కోట్ల అప్పు కోసం..

# 1,91,000 కోట్ల గనుల తాకట్టు

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- 'చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు
- చంద్రబాబు సర్కార్ అడ్డగోలుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది
- ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు
- రూ. 5,526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

ఏపీలో చంద్రబాబు సర్కార్ మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అప్పులు చేయడంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు.. 5,526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారని తెలిపారు. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి? అని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్వీట్టర్ - మిగతా3లో

## పూరి జగన్నాథ్ దైవ చిత్రాన్ని వినూత్నంగా
# విత్తనాల గింజలతో అద్భుతంగా చిత్రీకరణ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:**
ప్రపంచం లోనే పెద్ద రథోత్సవం ఐనా పూరి జగనాథ్ రథోత్సవం సందర్భంగా కుప్పంకి చెంది న చిత్ర కళాకారుడు పురుషోత్తం (పూరి ఆర్ట్స్) పూరిజగన్నాథ్ దైవ చిత్రాన్ని వినూత్నంగా విత్తనాల గింజలతో అద్భుతంగా చిత్రీకరించారు. గింజలతో జగన్నాధున్ని చిత్రాన్ని కళ్లకు కట్టినట్లు వేశారు అని పురుషోత్తంని పలువురు అభినందిస్తూ, వీడియోని షేర్‌లు చేస్తు న్నారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో
## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ భారీర్యాలీ



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:
కుప్పం పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలతో జీవితం నాశనం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని భారీర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని డి.ఎస్.పి పార్థసారథి తెలియజే శారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమా చారం ఇవ్వాలని కోరారు.మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు తమ బిడ్డలను కంటికి రెప్పలాచ జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:**
శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేనపార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్న పూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతి గురువారం మధ్యాహ్నం అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 50వ వారం శ్రీకాళహస్తి పట్టణం పెళ్లిమండపం వద్ద అన్నదానం నిర్వహించి, 500మందికి అన్నదానం చెయ్యడం జరిగింది. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, జన సేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో ప్రతివారం అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నారు.నియోజకవర్గంలోని నాయ కులు,జనసైనికులు,వీర మహిళలు దగ్గరుండి ఈ అన్నదాన కార్యక్రమం సమన్వయం చేసుకోవడం రాష్ట్రంలో ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని వినుత అభినందించారు.నియోజకవర్గ ఐటీ కో ఆర్డినేటర్ కావలి శివకుమార్ కుమారుడు కావలి మునియుక్తేష్ జన్మదిన సందర్భంగా ఈ రోజు అన్నదాన కార్యక్రమంకి వితరణ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కావలి. శివకుమార్, తోట. గణేష్, బి యస్ యస్ డమ్ము రాయల్, రవి కుమార్ రెడ్డి, రామ్, సురేష్, రిటైడ్ యమ్ ఆర్ ఓ చంద్రశేఖర్, లక్ష్మి,రాజ్య లక్ష్మి,పుష్ప, మాలతి, ఆర్ ఆర్ యమ్ అధ్యక్షులు సిద్దులాగారి ప్రసాద్, ఎల్ఐసి సుబ్బారావు, నాగేంద్ర ,టైగర్ హరి,వెంకట రమణ యాదవ్, దినేష్, ఆటో నాగరాజు, నరేష్ యాదవ్, చందు యాదవ్, అశోక్, కార్తీ, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన మండల ఉపాధ్యక్షుడు
## చందు జన్మదిన వేడుకలు



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
జనసేన పార్టీ ఎస్ఆర్ పురం మండల ఉపాధ్యక్షుడు చందు జన్మదిన వేడుకలు ఎస్ఆర్ పురం మండలం పుల్లూర్ క్రాస్‌లో ఘనంగా నిర్వహించారు.. చందు జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్ఆర్ పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు టిడి పి యూత్ అధ్యక్షుడు చంద్రబాబు రెడ్డి పాల్గొన్నారు చందు జన్మదిన సందర్భంగా భారీ కట్ చేసి టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు మిత్రులందరికీ చందుకి జన్మదిన శుభా కాంక్షలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బుల్లెట్ శీను చార్లెస్, భూప తి ఆచారి, సురేష్, గల్ల, వంశీ, మునిరత్నంరెడ్డి, దినేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలేక నేరేడు మార్కెటా?



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
చౌడేపల్లిమండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం మార్కెట్‌ను తలపిస్తుంది. ఇక్కడ ఒక ప్రక్క ప్రైవేటు వాహనాలు పార్కింగ్ ఎక్కువగా ఉండగా దానికి తోడు నేరేడు పళ్ళు మార్కెట్ నడుపుతున్నారు దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆసుపత్రిలో నేరేడు పండ్ల మార్కెట్ను నిషేధించాలని వారు కోరుతున్నారు.

# ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ దినోత్సవ కార్యక్రమం




**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:**
కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్. ఎస్. విభాగం ఆధ్వర్యాన ఎమెనో అతిథి గృహంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ దినోత్సవం సందంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవి ద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎమ్.దొరస్వామి మాట్లాడు తూ మాన వజీవితం ఎంతో విలువైందని,జీవితాన్ని చక్కగా మలచుకొనే అవకాశంమన చేతిలోనే వుందని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉన్నత స్థాయిలో వెలుగొందాలని తెలియజేశారు. అందు చేత విద్యార్థిదశలోనే జాగరూకులై మాద క ద్రవ్యాలకు దూరంగా వుండాలని, వాటి కి బానిస కావద్దని తెలియజేశారు. ఒక విద్యార్థి చదవాల్సిన సమయంలో చదవ కుండా వేరే వ్యాపకాల్లో వుంటే చివరకి మిగిలేవి కష్టాలేనని తెలియజేశారు.డీన్ అకడమిక్ అఫైర్సు ఆచార్య శ్యామల మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంవల్ల ఆరోగ్యం పాడవుతుందని, తల్లిదండ్రుల ఆశలను గుర్తుంచుకొని యువ త బాధ్యతాయుతంగా జీవించాలని, డ్రగ్స్ దుర్వినియోగనివా రణ వ్యక్తి స్థాయిలో, కుటుంబస్థాయిలో, సమాజ స్థాయిలో సాధించాలని తెలియ జేశారు.ఎక్సైజ్ సర్కిల్ ఇనస్పెక్టర్ ఏ. నాగరాజు మాట్లాడుతూ ఫోను వాడకాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దాని వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయని, డ్రగ్స్ తీసుకున్నటువంటి వారుఎంతగొప్ప వారైనశిక్షించడం జరుగుతుందని తెలియజేశారు.కీలకోపాన్యాసకులు అయినలా అండ్ ఆర్డర్, సర్కిల్ ఇనస్పెక్టర్ కుప్పం (రూరల్)జె.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఫోక్సో కేసులు ఎక్కు వగా వస్తున్నాయని, దాదాపు పది పోక్సో కేసులువస్తే వాట ిలో ఎక్కువ కేసులు గంజాయి సేవించినవారున్నారని,డ్రగ్స్ తీసుకున్న వారు విచక్షణ కోల్పోయి వ్యవ హరిస్తున్నారని, గంజాయి అమ్ముతున్న, పండి స్తున్న రైతులున్నపుడు వారికి గంజాయి పండించడం తప్పు అని తెలియజేయాలని, తక్కువ ధరలో లభించే మాదకద్ర వ్యాలలో గంజాయి ఒకటని, అందుకని ఎక్కువ మంది వాడే అవకాశం వుందని, డ్రగ్స్ తీసుకోవడంవలన మనిషి విచ క్షణ కోల్పోతున్నాడని, అందువల్ల స్త్రీలపై అనేక అత్యాచార కేసులు వస్తున్నాయని గుర్తు చేశారు.మనదేశ సంస్కృతి గొప్ప దని, దీన్ని కాపాడాల్సిన బాధ్యత యువత పై వుందని ఒక్కా ణించారు. ఫోను ద్వారా చేసే పరిచయాల వలన వచ్చే అన ర్థాలు చాల వున్నాయని, హెల్మెట్ పెట్టుకోకుండా వెళ్లేటపు డు జరిగే ప్రమాదాలుఘోరంగా వుంటాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం వలన వ్యక్తులు చనిపోవడమే కాక ఏ సంబం ధం లేని వారు కూడా చనిపోయే అవకాశం వుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులనుద్దేశించి మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే వుందని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన వుందని, ఏదైన అనుమానించదగిన వ్యక్తులు గాని, మీ పరిసర ప్రదేశాల్లో గాని ఏవైనా డ్రగ్స్ ఉపయోగిస్తుంటే, పోలీసు శాఖకు గాని, విశ్వవిద్యాలయ పదాధికారులకుగాని తెలియ జేయడం వలన,తాము (పోలీసులు) వెంటనే స్పందిస్తామని తెలియజేశారు.ఈ కార్య క్రమంలో ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్ ఆర్.యశోద, ప్రోగ్రా మింగు ఆఫీసర్సు డా.బి.శ్రీనివాస్, డా.ఎమ్.హరికృష్ణ, డా.టి.శోభ, డా. టి.వెంకటస్వామి, అధ్యాపకులు, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# " డ్రగ్స్ వద్దు బ్రో..."
# నినాదంతో మార్మోగిన చిత్తూరు!




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్ ఆధ్వర్యంలో,జిల్లాఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు,ఐపీఎస్ నేతృత్వంలో International Day Against Drug Abuse and Illicit Trafficking సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీ గాంధీ కూడలిలో ప్రారంభమై నగరంలోని ముఖ్య రహదారులపై సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ"మాద కద్రవ్యాలు విద్యార్థుల భవిష్యత్తును నాశ నం చేస్తాయి.వీటి వినియోగం నుండి దూరంగాఉండండి.బాధితులను రిహాబిలి టేషన్‌కు తరలించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలి."ఎస్పీ పిలుపునిస్తూ: "చిత్తూరును 'డ్రగ్ ఫ్రీ డిస్ట్రిక్ట్'గా మార్చడ మే మా లక్ష్యం. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా పై శక్తివంతమైన చర్య లు కొనసాగుతున్నాయి. సమాచార ముంటే వెంటనే 112 లేదా 9440900005కు సమా చారం ఇవ్వండి."ఈ కార్యక్రమంలో డి.ఎల్. ఎస్.ఏ జడ్జ్ శ్రీమతి భారతి, చిత్తూర్ మేయర్ ఆముద,చూడ చైర్మన్ కటారి హేమలత,జడ్పీ సీఈవో రవికుమార్, డిఎం హెచ్ ఓ సంధ్య,వివిధ శాఖల అధికారులు, పోలీసులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుప్పం సెంట్రల్ పార్క్ అభివృద్ధిపై
# ప్రజా సూచనల సమావేశం విజయవంతం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26 :**
కుప్పం సెంట్రల్ పార్క్ అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలు,సూచనలు స్వీకరించే ఉద్దేశంతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)ఆధ్వర్యంలో గురువారం రోజు సాయంత్రం 4:00 గంటల నుండి 6:00గంటల వరకు కుప్పం పార్క్ ప్రాంగ ణంలో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం,డా.సురేష్ బాబు,గౌనివారి శ్రీనివాసులు,రాజ్ కుమార్,నమున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడ సలహాదారు కమిటీ సభ్యులు, తెలుగుదేశం,జనసేన నరేష్ ,భారతీయ జనతా పార్టీ తులసీనాథ్, కూటమి నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం మాట్లాడుతూ "ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల అభిప్రాయాలను నేరుగా పాలనలోకి తీసుకురావడం పట్ల ఎల్లప్పుడూ నిబద్ధత చూపుతారు. అదే స్ఫూర్తితో కుప్పం సెంట్రల్ పార్క్ అభివృద్ధికి ముందుగా ప్రజలఅభిప్రాయాలు తెలు సుకోవడం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరి సూచనను గౌరవంగా పరిగణించి, పార్క్ ను ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటాము."ఈ సమా వేశంలో వచ్చిన ప్రజా సూచనలను కడ మరియు కుప్పంమునిసిపాలిటీ అధికారుల సమీక్ష అనంతరం, తగిన ప్రణాళికతో అభివృద్ధి చర్యలు చేపట్టనున్నాయి.

# తెలుగు యువత అధ్యక్షులుగా రియాజ్



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:**
అన్నమయ్యజిల్లా పీలేరు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలమేరకు, పీలేరు మండల తెలుగుయువత అధ్యక్షులు గా ముచ్చటగా మూడోసారి నల్లారి రియాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లారి కుటుంబానికి సన్నిహితుడిగా ఉంటూ ప్రతికార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ మంచి గుర్తింపు పొంది గొప్ప సేవలు అందిస్తున్న నన్ను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మూడోసారి తెలుగు యువత మండల అధ్యక్షులుగా ప్రకటించడం, హర్షణీయమని భవిష్యత్తులో యువతను ముందుకు నడిపిస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడుతూ పార్టీ బలోపేతకానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి..




**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
మాదకద్రవ్యాలకు నేటియువత దూరంగా ఉండవలసిన అవసరం ఉందని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి చిదంబరం విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మోదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం ప్రభుత్వడిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మారకద్రవ్యాలను వినియోగించడం వల్ల శారీరక, మానసిక మరియు సామాజిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. నారాయణమూర్తి మాట్లాడుతూ... మాద కద్రవ్యాల వినియోగం, అక్రమరవాణా కు పాల్పడ్డ వారిపై కఠినచర్యలు ఉంటాయ ని కాబట్టి యువత అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి ప్రదీప్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సి రాజ్యలక్ష్మి, అధ్యా పకులు డాక్టర్ సుదర్శనం, సోమశేఖర్, ఇతర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
శ్రీకాళహస్తి డ్రగ్స్‌తో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని టీడీపీపట్టణాధ్యక్షు డు విజయ కుమార్ అన్నారు. సీఎం చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో యాంటీ డ్రగ్స్‌డేను పురస్కరించుకుని టీడీపీ నాయకులు, పోలీసులు, ఎక్సైజ్ శాఖ, ఐసీడీఎస్, విద్యార్థులు పాల్గొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎకక్కడ గంజాయి పట్టుబడివన ఆంధ్ర మూలాలు ఉండేవని పత్రికల ద్వారా తెలుస్తుండేది అన్నారు. గత పాలకులు జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి యువతకు డ్రగ్స్ అందించారన్నా. దీంతో వారికుటుంబాలు రోడ్డుమీదకు వచ్చాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పలు పరిశరమలను తీసతుకు వచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నార న్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ద డానికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు.ఈ కార్యక్రమలో డీఎస్పీ నరసిం హమూర్తి,టీడీపీ నాయకులు,పలుశాఖల అధికారులు తదితరులు పల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా వార్డు కార్యదర్శులకు
# బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల
## చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో కౌన్సిలింగ్..



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరునగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఈనెల 30వ తేదీలోపల పారదర్శకంగా, ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పూర్తిచేయాలని గ్రామ వార్డు సచివాలయశాఖ జారీచేసిన ఉత్తర్వుల మేరకు చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలకసం స్థలు, మదనపల్లి, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగిరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకుసంబంధించి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. చిత్తూరు నగర పాలక పరిధిలోని చిత్తూరు నాగయ్య కళా క్షేత్రంలో ఈ నెల 27,28 తేదీల్లో బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. 27వ తేదీ 10.30గం నుంచి వార్డు అడ్మిని స్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. ఈనెల 28న ఉదయం10.30గం నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రట రీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా నగరపాలక సంస్థలు,పురపాలక సంఘాలు కౌన్సిలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

Cell: 9440352030 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# పార్టీలకు జూబ్లీ పరీక్ష?

-మొదటిపేజీ తరువాయి

తానే పోటీ చేస్తానని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, బీఆర్ఎస్‌కు ఈ సీటు సిట్టింగ్ స్థానం కావడంతో దాన్ని నిలబెట్టుకోవడం ప్రతిష్ఠాత్మకంగా మారింది. పార్టీ నుంచి రెండుసార్లు విజయం సాధించిన మాగంటి గోపీనాథ్ కుటుంబానికి టికెట్ ఇవ్వాలని భావిస్తోంది. గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపే ఆలోచనలో ఉన్నప్పటికీ, ఆమె సమ్మతం కోసం వేచి చూస్తోంది. ప్రత్యామ్నాయంగా, విష్ణువర్ధన్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉంది. సర్వేల ద్వారా నియోజకవర్గ ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. బీజేపీ కూడా ఈ ఎన్నికను తేలిగ్గా తీసుకోవడం లేదు. టీడీపీ, జనసేనతో కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తోంది. ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త పేరు అభ్యర్థిగా వినిపిస్తుండడం గమనార్హం. ఈ మూడు పార్టీలు సర్వేలు నిర్వహిస్తూ, నియోజకవర్గంలో తమ అవకాశాలను అంచనా వేస్తున్నాయి.తాజా సర్వే ఫలితాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏ పార్టీకి ఏకపక్ష ఆధిపత్యం లేదని స్పష్టం చేస్తున్నాయి. బీఆర్ఎస్‌కు మాగంటి గోపీనాథ్ కుటుంబంపై సానుభూతి ఉన్నప్పటికీ, గెలుపు హామీ కాదని సర్వేలు సూచిస్తున్నాయి. సునీత బరిలోకి దిగితే బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఆమె నిర్ణయం ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే, అధికార పార్టీకి విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని సర్వేలు తెలిపాయి. ఎంఐఎం స్వతంత్రంగా పోటీ చేస్తే, ఓట్ల చీలిక బీఆర్ఎస్‌కు కలిసిరావచ్చని కొన్ని నివేదికలు అంచనా వేస్తున్నాయి.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు, ముఖ్యంగా మైనారిటీ ఓట్లు, ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారాయి. ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా ఏ పార్టీకి మద్దతు ఇస్తుందనేది ఇంకా అస్పష్టంగా ఉంది. కాంగ్రెస్, ఎంఐఎం నాయకత్వంతో చర్చలు జరుపుతూ, వారి మద్దతును రాబట్టే ప్రయత్నంలో ఉంది. ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే, నియోజకవర్గంలోని మైనారిటీ ఓట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా మళ్లే అవకాశం ఉంది. అదే సమయంలో, ఎంఐఎం స్వతంత్ర అభ్యర్థిని నిలబెడితే, ఓట్ల చీలిక బీఆర్ఎస్‌కు ప్రయోజనం చేకూర్చవచ్చు.అభ్యర్థుల ఎంపిక ఈ ఎన్నికలో నిర్ణాయక పాత్ర పోషిస్తుంది. బీఆర్ఎస్ మాగంటి కుటుంబంపై ఆధారపడుతుండగా, కాంగ్రెస్‌లో అజహరుద్దీన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, హైకమాండ్ నిర్ణయం కోసం నాయకులు ఎదురుచూస్తున్నారు. బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఒక పారిశ్రామికవేత్తను బరిలోకి దింపే అవకాశం ఉంది, ఇది నియోజకవర్గంలో కొత్త డైనమిక్స్‌ను తీసుకురావచ్చు. సర్వేల ప్రకారం, స్థానిక సమస్యలపై పట్టు, అభ్యర్థి బలం, పార్టీ వ్యూహం ఫలితాన్ని నిర్ణయిస్తాయి.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక ఘట్టంగా మారింది. బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటును కాపాడుకోవడం, కాంగ్రెస్‌కు అధికార బలంతో సీటును గెలుచుకోవడం, బీజేపీకి మిత్రపక్షాలతో కొత్త ఒరవడి సృష్టించడం ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎంఐఎం పాత్ర, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల ఎంపిక ఫలితాన్ని శాసిస్తాయి. అక్టోబర్‌లో ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

# డిఫెన్స్ అకాడమి పేరుతో మోసం



**నల్గొండ :** అది పేరుకే డిఫెన్స్ అకాడమీ.. ఆర్మీ, నేవీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలంటూ హంగూ అర్భాటాలతో ప్రచారం.. రంగురంగుల బ్రోచర్లు.. మాయ మాటలు.. శాంపిల్స్ టెస్టులు.. ఇలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అరచేతిలో వైకుంఠం మాదిరి చూపించి.. రూ.లక్షలకు రూ.లక్షలు ఫీజుల దోపిడీకి దిగుతున్నారు. రెండు మూడేండ్లలో కొలువులంటూ నయా దందాకు తేరలేపారు.అదే నల్లగొండ జిల్లా కేంద్రానికి సమీపంలో రామయ్య డిఫెన్స్ అకాడమీ. నిజానికి కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ స్కీమ్ తీసుకొచ్చాక.. కేంద్ర భద్రత బలగాల కొలువులు ఆశించేవారి పరిస్థితి డొలాయమానంలో పడింది.కానీ రామయ్య డిఫెన్స్ అకాడమీ మాత్రం తన మాయ మాటలతో బురిడీ కొట్టించి అడ్మిషన్ల పేరుతో ఇంటిగ్రేటెడ్ కోర్సులంటూ ప్రతి ఏటా రూ.కోట్లు దండుకుంటున్నారు. ఏండ్ల తరబడిగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ తరహా దందా జరుగుతున్నా.. జిల్లా యంత్రాంగం కన్నెత్తి అటువైపు చూడకపోవడం కొసమెరుపు.ప్రస్తుతం చర్లపల్లిలో నిర్వహిస్తున్న రామయ్య డిఫెన్స్ అకాడమిని నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నడిపేస్తున్నారు. వాస్తవంగా రామయ్య డిఫెన్స్ అకాడమిలో ఇంటిగ్రేటెడ్ కోర్సులంటూ విద్యార్థులకు ఎర వేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు కేంద్ర భద్రత బలగాల కొలువులు సాధించేలా తీర్చిదిద్దుతామని నమ్మబలుకుతున్నారు. అందుకోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ. 1.50 లక్షలకు పైగా వసూలు చేస్తుండడం గమనార్హం.అసలు విషయం ఏమిటంటే.. రామయ్య డిఫెన్స్ అకాడమీకి ఇంటర్మీడియట్ అనుమతులు లేవు. కానీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో విద్యార్థికి అడ్మిషన్ చేయించి.. చర్లపల్లిలోని రామయ్య డిఫెన్స్ అకాడమిలో క్లాసులు చెబుతుండడం కొసమెరుపు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అసలు అనుమతి లేకుండానే ఇంటర్ కాలేజీని నిర్వహించడమనేది అతిపెద్ద క్రైమ్ అని చెప్పాలి.ప్రతి విద్యార్థి దశలో కీలకంగా భావించే ఇంటర్ దశలోనే విద్యార్థిని రామయ్య డిఫెన్స్ అకాడమీ మిస్ గైడ్ చేస్తోంది. సదరు ప్రైవేటు కాలేజీలో తరగతులకు హాజరుకావాల్సి ఉన్నా.. ఏనాడూ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అడుగుపెట్టే పరిస్థితి ఉండదు.ఎందుకంటే.. అసలు రామయ్య డిఫెన్స్ అకాడమీ నుంచి తాము ఇంటర్ పూర్తి చేస్తున్నామని అనుకుంటున్నారే తప్ప.. ఇతర కాలేజీలో అడ్మిషన్ తీసుకుంటున్న సంగతి విద్యార్థులకు తెలియకుండా రామయ్య డిఫెన్స్ అకాడమీ జాగ్రత్త పడుతోంది.నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ భారీ స్థాయి దందా ఏండ్ల తరబడిగా సాగుతున్నా.. జిల్లా యంత్రాంగానికి కాసింతైనా పట్టింపులేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అసలే ఓ వైపు ప్రైవేటు విద్యాసంస్థల నిలువు దోపిడీతో అప్రతిష్టను మూటగట్టుకుంటున్న విద్యాశాఖ.. రామయ్య డిఫెన్స్ అకాడమీ వ్యవహారాన్ని తేల్చకపోవడం వెనుక ఆంతర్యం ఏంటో తెలియడం లేదు.జిల్లా స్థాయి అధికారులు ఉండే నల్లగొండ జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉండడం.. అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఇలాంటి అనుమతులు లేని విద్యా సంస్థల్లో చదివి దారుణంగా మోసపోయిన ఘటనలను జిల్లాకు అనుకుని ఉన్న హైదరాబాద్లో ఇటీవల కాలంలో చూశాం.కానీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్నా.. పట్టింపులేకపోవడం దారుణమనే చెప్పాలి. ఏదైనా ఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందు జాగ్రత్తగా అలర్ట్ అయ్యి విద్యార్థులను భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు

# సిటీలో రాకాసీ చేపలే



**హైదరాబాద్ :** హైదరాబాద్ వాసులు ఇప్పుడు చేపల గురించే ఆలోచిస్తూ భయపడుతున్నారు. తినడానికి కాదు.. చూస్తేనే వెన్నులో జలదరింపు రాకుండా ఉండటం లేదు. చెరువుల మధ్యే జీవితం గడిపే మత్స్యకారులే ఇప్పుడు వల వేసేటపుడు వెనుకడుగు వేస్తున్నారు. ఎందుకంటే వలలో పడేది మనకు ఉపయోగపడే చేపలు కాదు.. ఏకంగా 'రాకాసి' చేపలే! ఎక్కడ చూసినా ఇవే.. వాటి పేరు చెబితేనే మిగతా చేపలు దూరంగా పారిపోతాయంట. శరీరానికి కంచు కవచంలా ఉన్న ఆకారంతో, పిల్లలు కాదు పెద్దవాళ్లకూ భయం వేసేలా ఉన్న ఆ చేపలు ఇప్పుడు హైదరాబాద్ చెరువుల్లో వేట మొదలుపెట్టాయి. అసలు ఈ చేపలను చూసి మత్స్యకారులే తట్టుకోలేక కాల్చేసే దాకా వెళ్లారంటే.. అసలు వ్యవహారం ఎంత తీవ్రమో మీరు ఊహించగలరు. అసలు విషయంలోకి వెళితే.. తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది జీవనోపాధిగా చేపల వేటను ఆధారంగా చేసుకుంటున్నారు. చెరువులు, నదులు, వాగులు ఇవన్నీ మన మత్స్యకారుల కడుపు నింపే జల వనరులు. కానీ తాజాగా హైదరాబాద్‌లోని చర్లపల్లి చెరువు వద్ద భయానక మాంసాహారి చేపల కలకలం నెలకొంది. మత్స్యకారులు వలలు వేసినప్పుడు టన్నుల కొద్దీ ఆర్మర్డ్ సెల్ఫిన్ క్యాట్ ఫిష్ అనే ఓ విచిత్రమైన చేపలే చిక్కుతున్నాయి. ఇవి సాధారణ చేపలు కావు. వీటిని డెవిల్ ఫిష్, లేక రాకాసి చేపలు అంటారు. ఇప్పుడు ఇవి ఇతర చేపలను నాశనం చేస్తూ తీవ్రంగా విస్తరిస్తున్నాయి. చర్లపల్లి చెరువు వంటి నీటి వనరుల్లో ఈ డెవిల్ ఫిష్ అనూహ్యంగా పెరిగిపోతుండడం, ఇతర జీవజాతుల కోసం ముప్పు సంకేతం. మత్స్యశాఖ అధికారులు దీన్ని ప్రాణాంతకంగా పేర్కొంటున్నారు. ఈ చేపలు లారీ కారిడ్ కుటుంబానికి చెందినవి. ఇవి ఇతర చేపల గుడ్లను, పిల్లలను తినేస్తూ పరిసరజలాల్లో ఏకంగా దేనినైనా తినే శక్తిని కలిగి ఉన్నాయి. ఒకసారి ఈ చేపలు చేరిన నీటిలో, మరెంత మంచి విత్తన చేపలు వేసినా అవి బతకలేవు. ఈ డెవిల్ ఫిష్ వాటిని తినేసి స్వయంగా పెరిగిపోతాయి. దీనివల్ల మిగిలిన సంప్రదాయ చేపల జాతులు అంతరించి పోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. వీటి అత్యాధునికమైన లక్షణం.. ఇవి తక్కువ ఆక్సిజన్ ఉన్న నీటిలో కూడా జీవించగలవు. అంతే కాదు, నీటికి బయటకు వచ్చినా, కొంత సమయం పాటు గాలిని నేరుగా పీల్చుకుంటూ బతికే శక్తి వీటిలో ఉంది. ఇది ఒక విధంగా చెరువుల టెర్మినేటర్ లా పనిచేస్తోంది. ఈ ప్రత్యేకతలే వీటిని మరింత ప్రమాదకరంగా మార్చాయి. చాలా మంది మత్స్యకారులు వలలు వేసిన ప్రతిసారీ ఈ చేపలే ఎక్కువగా పడుతుండటంతో, వారి ఆదాయ మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ చేపలు అసలు మన చెరువుల్లోకి ఎలా వచ్చాయి? అనేది మరో ఆసక్తికర ప్రశ్న. సమాచారం ప్రకారం, మొదట ఇవి అక్వేరియమ్ చేపలుగా బయట దేశాల నుంచి దిగుమతి అయ్యాయి. అప్పుడు పెద్దవవుతున్న కొద్దీ కొంతమంది వాటిని కాలువల్లోకి వదిలేశారు. అక్కడి నుంచి చిన్నకాలువల ద్వారా చెరువుల్లోకి ప్రవేశించాయి. ఇప్పుడు పరిస్థితి అదుపు తప్పే దిశగా సాగుతోంది. వీటిని ప్రభుత్వ వైపు నుంచి సరఫరా చేసిన మంచి విత్తన చేపలు తినేస్తుండటంతో ప్రభుత్వ పెట్టుబడులే నష్టమవుతున్నాయి. ఇదే విషయంపై మత్స్యకారులు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వలల్లో మనకు అవసరమైన రొయ్యలు, బంగరు తీల, కొరమెన, తిలపియా వంటి చేపల బదులు ఇప్పుడు ఈ ఆక్రమణ చేపలే పడుతున్నాయని వాపోతున్నారు. బజార్లో ఇవి విలువ ఉండకపోవడంతో అమ్ముడుపోయే అవకాశాలు తక్కువ. పైగా ఇంట్లో తినే అలవాటు కూడా లేదు. దీంతో ఆ చేపలను రోడ్లపైకి తీసి కాల్చేస్తున్నారు, చంపేస్తున్నారు. ఇది చూస్తుంటే గుండెను కలిచివేసే దృశ్యం. కానీ మిగిలిన చేపల రక్షణకై ఇది తప్పనిసరి చర్యగా మారిందని వారి మాట. ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ డెవిల్ ఫిష్ నాశనం చేసే విధానాన్ని పటిష్టంగా అర్థం చేసుకొని, వాటిని పూర్తిగా తొలగించే వ్యూహం రూపొందించాలి. అవసరమైతే శాస్త్రీయంగా తగిన మందులు, వ్యర్థజల నియంత్రణ చర్యలు చేపట్టాలి. మత్స్యకారులకు మార్గనిర్దేశం చేయాలి. ఒక వేళ ఇది నిర్లక్ష్యం చేస్తే, తెలంగాణ రాష్ట్రంలోని చాలా చెరువులు భవిష్యత్తులో చేపలేని నీటి బావులుగా మారే ప్రమాదం ఉందని కొందరి అభిప్రాయం. పర్యావరణం, జీవవైవిధ్యం, గ్రామీణ జీవనోపాధి.. ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఒకటిపై ముప్పు వస్తే అన్నిటిపై ప్రభావం పడుతుంది. చర్లపల్లి చెరువు ఘటన ఇప్పటికైనా సైరన్ లా ప్రభుత్వానికి, పర్యావరణ నిపుణులకు హెచ్చరికలా ఉండాలి. మత్స్యకారులు లాంటివారు రోజూ జీవనోపాధికోసం చెరువులోకి వెళ్లి ఈ రాకాసి చేపల ముప్పుతో ఎదురైతే, వారి జీవితం నరకంగా మారిపోతుంది. మొత్తానికి, చెరువుల్లోకే చొచ్చుకుపోయిన ఈ డెవిల్ ఫిష్ అన్నిటికంటే ముందుగా మన తెలివిని పరీక్షిస్తున్నాయి. మనం శాస్త్రీయంగా స్పందిస్తే తప్ప, భవిష్యత్తులో మన పిల్లలు చేపలంటే ఫోటోలే చూస్తారు తప్ప చెరువుల్లో కాదు. అందుకే ఈ రాకాసి చేపలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. మొత్తం మీద హైదరాబాద్ నగరాన్ని రాకాసి చేపలు భయపెడుతున్నాయని ఒక్క మాటలో చెప్పవచ్చని మత్స్యకారుల మాట

## బాబూ.. 9,000 కోట్ల అప్పు కోసం..
## 1,91,000 కోట్ల గనుల తాకట్టు

-మొదటిపేజీ తరువాయి

వేదికగా.. 'చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు. చంద్రబాబు సర్కార్ అడ్డగోలుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు. రూ. 5,526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారు. గతంలోనే ఈ రాజ్యాంగ ఉల్లంఘనపై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ అప్పులు చేశారు. రానున్న రోజుల్లో మళ్ళీ మళ్ళీ ఏపీఎండీసీ ద్వారా అప్పులు చేయటానికి సిద్ధమయ్యారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రైవేటు వ్యక్తులు నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు డ్రా చేయటానికి వీల్లేదు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పార్టీలే నేరుగా నిధులు డ్రా చేసుకునేలా అవకాశం కల్పించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. రూ.9000 కోట్ల అప్పుల కోసం ఏపీఎండీసీకి చెందిన రూ. 1,91,000 కోట్ల విలువైన గనులను తాకట్టు పెట్టటం దారుణం. అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావటం ద్వారా %ఖ్రావీణజ%పై సంవత్సరానికి రూ.235 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి?. మా హయాంలో ఐదేళ్లలో చేసిన అప్పుల్లో సగం చంద్రబాబు ఈ ఒక్క? ఏడాదిలోనే చేశారు' అని చెప్పుకొచ్చారు.

## రాజకీయం ముసుగులో
## రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

అర్హత లేదని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గంజాయి నిర్మూలన బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదు.. ప్రతిపక్షాలు కూడా ముందుకువచ్చి ప్రజల్లో చైతన్యం తేవాలని సీఎం చంద్రబాబు కోరారు. చైతన్యం తెచ్చి ఓట్లు కోరాలి తప్ప రాజకీయ లబ్ధి పొందుతామంటే కుదరదని తేల్చిచెప్పారు. ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా డేగకన్ను వేశామని చెప్పుకొచ్చారు. 26 జిల్లాల్లో నార్కొటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈగల్ సెల్స్, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, స్కూళ్లలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు సీఎం చంద్రబాబు. మద్యం ఆదాయంలో రెండు శాతాన్ని గంజాయి నిర్మూలనకు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మేవారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయిపై పోరాడితే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని గుర్తుచేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సినీ సెలబ్రిటీలు ముందుకురావాలని కోరారు. గంజాయి వేరే ప్రాంతాలనుంచి తీసుకువచ్చి ఏపీలో అమ్మినా వదిలేది లేదని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు.

## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు..



**హైదరాబాద్:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ద్రోణి ఒకటి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 – 7.6 కి.మీ మధ్యలో ఏర్పడిందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## ఆరోగ్య శాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ

-మొదటిపేజీ తరువాయి

1284 ల్యాబ్ టెక్నీషియన్, 1950 మల్టి పర్పస్ ఫీమెల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. మెరిట్ జాబితాలు సిద్ధమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లోని పోస్టుల భర్తీకి రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. ఇవాళ సాయంత్రం లేదా రేపు ఉదయం 3 నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి.

## పల్లెల్లో ఎన్నికల వేడి

**వరంగల్ :** స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల నిర్వహిస్తామని అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక బీసీలకు రిజర్వేషన్లు కూడా కేటాయిస్తామని వెల్లడించింది. బిసీల రిజర్వేషన్ల విషయంలో అనేక న్యాయపరమైన సమస్యలో ఉన్న నేపథ్యంలో.. ప్రభుత్వం కాస్త వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. ఇటీవల బీసీల రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభలో ప్రభుత్వం ఒక తీర్మానాన్ని రూపొందించి కేంద్రానికి పంపించింది. అయితే ఆ తీర్మానాన్ని కేంద్రం ఇంకా ఆమోదించలేదని తెలుస్తోంది. కేంద్రం ఆమోదించిన తర్వాత అది రాష్ట్రపతి పరిధిలోకి వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఆ బిల్లుకు మోక్షం లభిస్తుంది. అయితే బీసీలు కేవలం తెలంగాణలో మాత్రమే లేరు కాబట్టి.. పైగా రిజర్వేషన్ల అంశం అనేది కేంద్ర పరిధిలోది కాబట్టి.. దీనిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం ఆశించినత స్థాయిలో ఆసక్తి చూపించకపోవడంతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇప్పటికే స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి అనేక పిటిషన్లు వెళ్లాయి. ఆ పిటిషన్లను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది స్పందించారు. ప్రభుత్వం తరఫున ఎన్నికల నిర్వహణకు 30 రోజుల సమయం కావాలని కోరారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు 60 రోజుల గడువు కావాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసిన సర్వోన్నత న్యాయస్థానం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలను సెప్టెంబర్ లోపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.వార్డుల విభజన, ఓటర్ జాబితాలో మార్పులు , చేర్పులు.. కొత్త ఓటర్లు నమోదు.. రిజర్వేషన్లు.. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఎన్నికలు జరుగుతాయని తెలుస్తోంది.. ఇక తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో 8 స్థానాలు సాధించినప్పటికీ.. అధికార పార్టీకి ఆ ఫలితాలు అంతగా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర పరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో జడ్పీ చైర్మన్, ఇతర స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తామని చెబుతున్నాయి

### అనధికారికంగా పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు
## కలిగిన వాహనాలపై కేసులు నమోదు.



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26**
శ్రీకాళహస్తి అనధికారికంగా పోలీస్, ప్రెస్ స్టిక్కర్లను వాహనాలపై వేసుకుంటే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ గోవింద్ అన్నారు. గురువారం ఒకటవ పట్టణ సీఐ గోపి ఆదేశాల మేరకు పట్టణంలోని పలుచోట్ల పోలీస్, ప్రెస్, ష్టిక్కర్లు కలిగిన వాహనాల పై కేసులు నమోదు చేసి వారి చేత స్టిక్కర్లను తొలగించారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీస్, ప్రెస్ విధులకు సంబంధం లేని వారు ఇలా స్టిక్కర్లు వేసుకుంటే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ వెంకటేష్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, వికలాంగుల కూ ఇంటి వద్దనే రేషన్ పంపిణీ



**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:** వరదయ్యపాలెం తహసీల్దార్ సుధీర్ రెడ్డిసూచించారు. 26వతేదీ నుండి 30వతేదీ వరకు దివ్యాంగులు, సీనియర్ సిటిజెన్‌లకు వారింటివద్దకే బియ్యంపంపిణీ చేయాలని, ప్రభుత్వం నిర్ణయంకుకట్టుబడి పనిచేయాలని సూచించారు.రేషన్ షాప్ డీలర్ రవి ఆధ్వర్యంలో గురువారం పొద్దున్నే 6:30 గంటలనుండి పలువురు వృద్ధులకు ఇంటింటికి రేషన్ సరుకులను పంపిణీ చేశారు.తిరుపతిజిల్లా వరదయ్యపాలెంలో రేషన్ దుకాణాలవద్దకు రాలేని వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ బియ్యం సరుకులు అందించేందుకుకూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వరదయ్యపాలెం హరిజన వాడలో పలువురు వృద్ధులకు రేషన్ డీలర్ రవి ఇంటింటికి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. గతంలో ఎప్పుడు వస్తారో తెలియక.. నెలకోసారి వచ్చే వాహనాల వద్ద గంటలతరబడి నిరీక్షించే దుస్తితి నెలకొందని, ఒకనేల తీసుకోక పోతే రేషన్ బియ్యం అందేది కాదని.. ఇపుడు ఆదరి ద్రకష్టాల నుంచి విముక్తి కల్పిస్తూ ఇంటికే తెచ్చి ఇస్తుండటంతో కూటమి ప్రభుత్వంకు రుణపడిఉంటా మని ప్రభుత్వానికి డీలర్లుకు కృత్ఞతలు తెలిపారు.

## వైష్ణవిదేవి ఆలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:** చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామంలో ఉన్న స్వయంభు వైష్ణవిదేవి మాత ఆలయంలో గురువారం వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ గావించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణకర్త వినోద్ కుమార్ రెడ్డి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. వారాహి నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజు పలు కార్యక్రమాలు జరుగుతాయని భక్తుల పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణి

### పాదర్శకత, పర్యవేక్షణతో ఎస్.హెచ్.జీ గ్రూపుల బలోపేతం... ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 26:** పలమనేరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లో పనిచేసే రిసోర్స్ పర్సన్ లకు పలమనేరు శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి చేతుల మీదుగా గురువారం ఆయన కార్యాలయంలో ట్యాబులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్వయం సహాయక సంఘాల బలోపేతం మరియు మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. అందులో భాగంగా బ్యాంకు లింకేజీ సంఘ సభ్యులకు పారద ర్శకంగా ఉండాలని ఉద్దేశంతో, ఎలాంటి అవకాతవకులు జరగకుండా పర్యవేక్షణ చేయడానికి అదేవిధంగా బ్యాంకురుణాల ను మంజూరుచేయడంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కోసం ట్యాబ్ లను పంపిణీ చేయడం జరుగుతు న్నదన్నారు.దీంతో పాటు సంఘసభ్యుల డేటా నందు మార్పులు చేర్పులతో పాటు కొత్తగా చేరే సభ్యుల వివరాలను, సంఘ మహిళల ఉత్పత్తులకు ఆన్లైన్లో మార్కెట్ అవకాశాలు కల్పించడం తదితర అంశాల నమోదుకు ట్యాబ్‌లు వినియోగించనున్నరన్నారు. పై కార్యక్రమాలన్నింటినీ పారదర్శకంగా అమలు చేయాలానే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నదన్నారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని రిసార్స్ పర్సన్లు పాటించి ఎస్ కే జి గ్రూపులో బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి, మెప్మా మేనేజర్ బాబాతో పాటు సివో లు టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, ఖాజా, బిఆర్సి కుమార్, మదన్, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నా రు.

# డ్రగ్స్ భారినపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

**అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్**
**మాదకద్రవ్యాలకు దూరంగా సంతోషమైన సమాజానికి కృషి చేయాలని పిలుపు**



**పలమనేరు,ఽచిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 26:**
డ్రగ్స్ బారినపడియువత బంగారు భవి ష్యత్తును నాశనం చేసుకోవద్దని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు పోలీస్శాఖ ఆధ్వర్యంలో స్థాని క ప్రభుత్వడిగ్రీ కళాశాలలో గురువారం యువతకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన తొలుత మాదకద్రవ్యాలకు దూరంగా సంతోషక రమైన సమాజానికి కృషిచేస్తామని యువతచే ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ....డ్రగ్స్ వదుద్రో అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నదని దీని పై ప్రభుత్వం, సిఎం చంద్రబాబు ప్రత్యేకమైన దృష్టిని సారించడం జరిగిందన్నారు. డ్రగ్స్ కారణంగా చాలా మంది జీవితాలు నాశ నమవుతున్నాయి ఈ విషయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించచడం జరుగుతున్నదన్నారు. యువతే ఎక్కువగా డ్రగ్స్ భారిన పడే అవకాశం ఉన్నందున డ్రగ్స్ వల్ల కలిగే అనర్థలపై అవగాహన ఉండాలన్నారు. ఎక్కువ మంది సినిమా పరిశ్రమకు చెందిన వారే డ్రగ్స్ కు ప్రభావితం అవుతున్నట్లు తెలుస్తున్నదని,యుక్త వయసులోని యువత సినిమాల పట్ల ఎక్కువగా ఆకర్షి తులయ్యే అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్స్ ప్రభావంమూలంగా ఓవైపు ఆరోగ్యంతో పాటు మరోవైపు మానసిక ఆరోగ్యం కూడా పూర్తిగా దెబ్బ తింటుందన్నారు. కుటుంబంలోని వ్యవస్థలన్నీ దెబ్బతింటాయని ఇప్పుడున్న చట్టాల వల్ల భవిష్యత్లో అందాల్సిన అవకాశాలన్నీ పోగొట్టుకోవాల్సి వస్తుందని వివరించారు. కాబట్టి డ్రగ్స్ కారణంగా జీవితం మొత్తంనాశనం అవుతుందని యువత గుర్తించాలి. అందుచేత అటువంటి వాటిని అడ్డుకునేందుకు కృషి చేయాలి. డ్రగ్స్ సమాచారం ఏదైనా తెలిస్తే ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించి అరికట్టేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం ఆయన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్, సీఐలు నరసింహ రాజు, మురళి, ప్రసాద్, ఎస్సైలు స్వర్ణతేజ, లోకేష్ రెడ్డి మరియు మున్సిపల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఆరోజు ఆస్ట్రేలియా మా కలల్ని కూల్చింది..
# ప్రతీకారం తీర్చుకున్నామిలా!

## స్పోర్ట్స్

పొట్టి క్రికెట్, టెస్టులకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ రెండేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి తనను ఎంతో బాధించిందని అన్నాడు. సొంతగడ్డపై విశ్వవిజేతగా నిలవాలనుకున్న తమ కలల్ని ఆస్ట్రేలియా కల్లలు చేసిందని.. ఆ ఓటమికి టీ20 వరల్డ్ కప్‌లో ప్రతీకారం తీర్చుకున్నామని హిట్‌మ్యాన్ చెప్పాడు. ఐసీసీ టోర్నమెంట్లలో వరుసగా రెండో ఫైనల్ చేరిన భారత జట్టు.. వెస్టిండీస్ గడ్డపై ఆసీస్ గోడను బద్ధలు కొట్టిన తీరును రోహిత్ వివరించాడు. 'వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో మాకు ఆస్ట్రేలియా షాకిచ్చింది. అహ్మదాబాద్ వేదికగా నవంబర్ 19న జరిగిన టైటిల్ పోరులో ఆసీస్ మా కలల్ని కూల్చింది. ఆ ఓటమిని జీర్ణించుకోలేకపోయాం. అందుకే ఆ జట్టుకు మేము రిటర్న్ గిఫ్ట్‌గా అంతే బాధను ఇవ్వాలనుకున్నాం. ఇదే విషయమై తరచూ డ్రెస్సింగ్ రూమ్‌లో మాట్లాడుకునేవాళ్లం. టీ20 వరల్డ్ కప్‌లో ఆసీస్‌పై ప్రతీకార విజయం సాధించాలనుకున్నాం. మా చివరి సూపర్ 8 మ్యాచ్‌లో సమిష్టిగా చెలరేగాం.. కంగారూలను పొట్టి ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించింది' అని హిట్‌మ్యాన్ వెల్లడించాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. బలమైన పేస్ దళాన్ని ఉతికేస్తూ 92 పరుగులతో రాణించిన అతడు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం సెమీఫైనల్లో ఇంగ్లండ్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లిన రోహిత్ సేన కప్‌ను ఎగరేసుకుపోయింది. ఉత్కంఠ రేపిన టైటిల్ పోరులో విరాట్ కోహ్లీ అర్ధ శతకంతో మెరవగా.. జస్ప్రీత్ బుమ్రా సంచలన బౌలింగ్‌తో రాణించాడు.




177 పరుగుల ఛేదనలో హెన్రిచ్ క్లాసెన్ అర్ధ శతకంతో దక్షిణాఫ్రికా గెలుపు దిశగా దూసుకెళ్తున్న వేళ బుమ్రా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. కాసేపటికే పాండ్యా ఓవర్లో డేవిడ్ మిల్లర్(%ఋఖజఊఆ వీఅశ్రీశ్రీవతీ%) ఆడిన బంతిని బౌండరీ లైన్ వద్ద సూర్యకుమార్ యాదవ్ అద్భుత రీతిలో అందుకున్నాడు. అంతే.. సఫారీలకు మరోసారి నిరాశే మిగలగా రెండోసారి టీమిండియా పొట్టి కప్‌ను ముద్దాడింది. బార్బడోస్ గడ్డపై టీ20 ట్రోఫీ గెలుపొందిన తర్వాత రోహిత్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. కోహ్లీ వీడ్కోలు పలుకుతున్నట్టు చెప్పిన కాసేపటికే తాను కూడా పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు వెల్లడించాడు. అంతేకాదు ఇంగ్లండ్ పర్యటనకు ముందే టెస్టులకూ గుడ్ బై చెప్పేసి అందర్నీ షాక్‌కు గురిచేశాడు రోహిత్. ప్రస్తుతం విరాట్, హిట్‌మ్యాన్‌లు వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు.

### టీమిండియా మ్యాచ్‌లపై ప్రవాసీల ఆసక్తి..
### రెండు వారాల్లోనే 90 వేల టికెట్లు సేల్..!



ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు వైట్ బాల్ సిరీస్ కోసం అక్టోబర్‌లో ఆస్ట్రేలియా వెళ్లనుంది. ఇంకా నాలుగు నెలల సమయం ఉన్నప్పటికీ అభిమానులు ఇప్పటి నుంచే సిరీస్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. దాంతో, టికెట్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. టికెట్స్ అమ్మకాలు మొదలుపెట్టడమే ఆలస్యం హాట్‌కేకుల్లా కొనేశారు ఫ్యాన్స్. మూడో వన్డేకు వేదికైన సిడ్నీ, కాన్‌బెర్రాలో జరుగబోయే తొలి టీ20 మ్యాచ్ టికెట్ల అమ్మకాలను ప్రారంభించగా.. పూర్తిగా సేల్ అయ్యాయని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. అక్టోబర్ – నవంబర్ మధ్య భారత్, ఆస్ట్రేలియా మధ్య సిరీస్ జరుగనుంది. ఫ్యాన్స్ అయితే ఈ సిరీస్‌పై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రవాస భారతీయులు చాలా ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. నాలుగు నెలలకు ముందే సిడ్నీలో వన్డే, కాన్‌బెర్రాలో టీ 20 మ్యాచ్ టికెట్లను పూర్తిగా అమ్ముడుపోయాయి. గబ్బాలో జరుగబోయే టీ20కి టికెట్లకు కూడా ఫుల్ డిమాండ్ నెలకొంది' అని గురువారం క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. యాషెస్ సిరీస్‌కు ఎంత క్రేజ్ ఉందో తెలిసిందే. అలానే భారత్ %–% ఆసీస్ సిరీస్ పట్ల కూడా అభిమానులు అమితాసక్తి కనబరుస్తున్నారు. అక్టోబర్‌లో టీమిండియా 8 మ్యాచ్‌ల వైట్ బాల్ సిరీస్ కోసం కంగారు గడ్డపై అడుగుపెట్టనుంది. దాంతో, క్రికెట్ ఆస్ట్రేలియా ఈమధ్యే మ్యాచ్ టికెట్ల అమ్మకాలు ప్రారంభించింది. ఆశ్చర్యంగా.. రెండు వారాల్లోనే 90 వేల టికెట్లు అమ్మకాలు జరిగాయి. భారత్ ఆర్మీ అనేది మా దేశంలో అతడి పెద్ద క్రికెట్ ఫ్యాన్ క్లబ్. ఈ క్లబ్ వాళ్లు ఏకంగా 2,400 టికెట్లు కొనగా.. ఇతర ఫ్యాన్స్ 1,400 టికెట్లు కొనేశారు అని క్రికెట్ ఆస్ట్రేలియా ఈవెంట్స్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ జోయెల్ మోరిసన్ తెలిపాడు.

### టీమిండియాతో రెండో టెస్ట్..
### ప్రమాదకర బౌలర్‌ను జట్టులోకి తీసుకున్న ఇంగ్లండ్



జులై 2 నుంచి బర్మింగ్హామ్ వేదికగా టీమిండియాతో జరుగబోయే రెండో టెస్ట్ కోసం ఇంగ్లండ్ జట్టును ఇవాళ (జూన్ 26) ప్రకటించారు. ఈ జట్టులో ప్రమాదకర ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ చోటు దక్కించుకున్నాడు. 30 ఏళ్ల ఆర్చర్ నాలుగేళ్ల తర్వాత ఇంగ్లండ్ టెస్ట్ జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. ఆర్చర్ 2021 ఫిబ్రవరిలో చివరిసారి టెస్ట్‌ల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్‌ను టీమిండియాతోనే ఆడాడు. ఆతర్వాత అతను వరుస గాయాల కారణంగా క్రికెట్‌కు దూరమయ్యాడు. ఆర్చర్ గతేడాది మేలో పరిమిత ఓవర్ల ఫార్మాట్లలోకి తిరిగి వచ్చాడు. తాజాగా అతను టెస్ట్ జట్టులో కూడా చోటు దక్కించుకున్నాడు. ఆర్చర్ ఇటీవల కౌంటీ ఛాంపియన్‌షిప్ చివరి రౌండ్ మ్యాచ్‌లో ససెక్స్‌కు ఆడుతూ దర్హమ్‌ను ఎదుర్కొన్నాడు. తాజాగా ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో ఆర్చర్ అదనంగా జోడించబడ్డాడు. తొలి టెస్ట్ కోసం ప్రకటించిన జట్టు యధాతథంగా కొనసాగింది. ఆర్చర్ తాజాగా ఆడిన కౌంటీ మ్యాచ్‌లో 18 ఓవర్లు బౌలింగ్ చేసి ఓ వికెట్ తీశాడు. బ్యాటింగ్‌లో 34 బంతులు ఎదుర్కొని 3 ఫోర్లు, సిక్సర్ సాయంతో 31 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆర్చర్‌కు బ్యాటింగ్, బౌలింగ్ అవకాశం దక్కలేదు. రెండో టెస్ట్‌లో ఆర్చర్‌కు తుది జట్టులో కూడా చోటు దక్కే అవకాశం ఉంది. ఆర్చర్ చేరిక ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ విభాగానికి అదనపు బలం చేకూరుస్తుంది. ఇప్పటికే ఇంగ్లండ్ తొలి టెస్ట్‌లో గెలిచి భారత్‌పై ఆధిక్యంలో కొనసాగుతుంది. రెండో టెస్ట్‌లో ఆర్చర్ తుది జట్టులో చేరితే టీమిండియాకు కష్టాలు తప్పవు. ఆర్చర్ తుది జట్టులో చేరితే ఏ పేసర్‌పై వేటు వేస్తారో చూడాలి. తొలి టెస్ట్‌లో పేసర్లు బ్రైడన్ కార్స్ (4 వికెట్లు), జోష్ టంగ్ (7), స్టోక్స్ (5)అద్భుతంగా రాణించారు. వీరు ముగ్గురే 16 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్ నిరాశపరిచాడు. అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్ట్‌లో వోక్స్‌ను పక్కన పెట్టి ఆర్చర్‌కు అవకాశం ఇవ్వొచ్చు. ఆర్చర్ తాజాగా ముగిసిన ఐపీఎల్‌లో, అంతకుముందు జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో పర్వాలేదనిపించాడు. ఈ అర్హతలతో అతను రెండో టెస్ట్ తుది జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. ఆర్చర్ ఇంగ్లండ్ తరఫున 13 టెస్ట్‌ల్లో 3 ఐదు వికెట్ల ప్రదర్శనల సాయంతో 42 వికెట్లు తీశాడు. కాగా, టీమిండియా ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. తొలి టెస్ట్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో పరాజయంపాలైంది. ఆ మ్యాచ్‌లో భారత్ తరఫున ఐదు సెంచరీలు నమోదైన ఓటమి తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 471, రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులు చేసినా.. భారత? బౌలర్లు 371 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయారు. ఛేదనలో బుమ్రా సహా భారత బౌలర్లంతా తేలిపోయారు. మ్యాచ్ మొత్తంలో భారత ఫీల్డర్లు ఏకంగా ఏడు క్యాచ్‌లు నేలపాలు చేసింది. జైస్వాల్ ఒక్కడే నాలుగు క్యాచ్‌లు జారవిడిచాడు. భారీ లక్ష్య ఛేదనలో బెన్ డకెట్ అద్భుతమైన సెంచరీ చేసి ఇంగ్లండ్‌ను గెలిపించాడు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143